# విశ్వరూపగృహలక్ష్మి

శ్రీమతి వోరుగంటి శ్యామలగారు

శ్యామల:—అమ్మా! గృహలక్ష్మి అక్కయ్య రాత్రివచ్చి నా మంచంమీద కూర్చుని నాతో మాట్లాడిందే.

పార్వతమ్మ:—యేం చెప్పిందమ్మా?

శ్యామల:—"చెల్లాయ్! చూశావ్! నీవు నన్ను ప్రేమతో నెల్లప్పుడు తలుస్తున్నావు గనుక నేను మళ్లీ నీ వద్దకు వచ్చాను. నే నెవరినో బాగా తెలుసుకోవా లనుకుంటున్నావు గాన చెప్తాను విను. నేను ఆదిశక్తిని. దుష్టులను శిక్షించుట, శిష్టులను రక్షించుటయే నాపని. నా కంటె కగపడని దేదీ లేదు. నేను చేయలేని దేదీ లేదు. బ్రహ్మకు సృష్టించుటలో తోడు నీడ నై నదానను నేను. విష్ణువుకు రక్షించుటలో చేయూత నిచ్చెడుదానను నేను. ఈశ్వరునకు అర్ధాంగినై చంపుటలో సహాయము చేయుదానను నేను. ప్రత్యక్షమే నిజము గాని పరోక్షము "అదేమో" అను పాశ్చాత్య సిద్ధాంతము ననుసరించి 'రామునకు కోతులు సహాయమా' అన్న చర్చ భారతదేశములో కూడా ప్రబలిన వద్దనుంచీ, నా ప్రభావము చూపుటకు అనేకవేల యకరముల భూమి ఆక్రమించి, నిస్సారవంతముగా జేసిన బ్రహ్మాండమయిన బ్రహ్మచెముడును, రావణ తలలవలె యెన్ని మార్లు నరికినా తిరిగి మొలిచెడు బ్రహ్మచెముడును, దిగంత విఖ్యాతిజెందిన ఆంగ్ల ప్రభుత్వము ధనవ్యయముతో నిర్మూలము చేయలేని బ్రహ్మచెముడును, చోరులకు, దుష్టజంతువులకు ఆటపట్టయిన బ్రహ్మచెముడును అణుమాత్రము లయిన పురుగులతో నిర్ధూమ ధామముచేసి రామాయణమే గాక భారత గాధలన్నియు నిజమని నిర్ధారణ చేసినదానను నేను. "ఏ దేశం తప్పుత్రోవలో బడితే ఆ దేశాన్ని వుద్ధరించడమే నా పని. కొన్ని సంవత్సరాల క్రిందట వంగదేశీయులు, వారి స్వశక్తిని కోలుపోయి, (బారాబంగాలీ మిల్కే- బకిరీకా ఖాన్ సహీంకాట్నే సఖా) "పంద్రెండుగురు బంగాలీయువకులు కలసి వక మేకచెవిని కోయలేక పోయిరి"'న్న అపఖ్యాతికి లోబడ్డారు. పాశ్చాత్య నాగరికతా మహాత్మ్యముచే వంగమాతను మరచిపోయారు. వారి అవస్థను జూచి సహించలేక అక్కడ "కాళీమాయి"నై వారిని నిరంతర కాళీపూజా ధురంధరులుగాను, సహజ ధైర్యవంతులుగాను, స్వశక్త్యోత్పన్న వస్తుధారణప్రియులుగాను, దేశభక్తి పరాయణులుగాను

చేశాను. సరస్వతీ రూపముతో అమృత మును చేబట్టి "అమృత బజారు"న్న పేరుతో మెన్నో సంస్థానముల నుద్ధరించాను. ఇంకా అక్కడ సవరించవలసిన పను లనేక మున్నాయ్. కాని, ఆంధ్రులు, తమ స్వశక్తిని మరుచుట; నిత్యపూజలు మానుట; దేశాభిమానము వదలుట; ఆంధ్రులన నెవరో తెలియని వేషములను ధరించుట చూడగా, నా మనస్సు చలించి, వీరిని సరియగు దారిని పెట్టవలె నన్న ఉద్దేశ్యముతో ఆంధ్రదేశ ప్రచారము చేయుచున్నాను.

శ్యామల:—'కాళీమాయి'వి కూడా నీవే అయితే, ఆ పుర్రెల తావళం, ఆ మెర్రని రక్తపునోరు, ఆ భీకరాకారం మేవీమరి?

గృహలక్ష్మి:—"అయ్యో! చెల్లాయ్! నేను నా నిజవాహనమగు కేసరినెక్కి నా కుటీరము లో నే వుండి, నిశ్చలత్వముతో నా దృష్టులను దేశమం దంతటను ప్రసరింపచేసి, తప్పొప్పులను కనుగొనుచున్నాను. ఆంధ్ర పురుషలోకము నేనెరగనిది కాదు. వా రిదివరలో దేశ స్వాతంత్ర్యమునకై పోరాడిన పోరాటములు; కవీశ్వరులకు చేసిన మర్యాదలు; స్త్రీల యందు జూపిన గౌరవము, జాతి, కుల వ్యత్యాసములు లేక, ఆకలిగొన్న వారికి చేసిన అన్నదానములు; వారు చేసిన యజ్ఞాదిక్రతువులు; దేవపూజలు; నేను మరచితి ననుకొన్నావా? లేదు. ఆంధ్ర పురుషులునిరంతరమంత్రదీక్షాపరాయణు లగుటచే, వారు ఇదివరకే నా శక్తి సామర్థ్యములను కనుగొని యున్నారు. అందుచే వారికి నా నిజస్వరూపము జూపనక్కరలేదు, గాని వీరు ఇప్పుడు తమ స్వశక్తులను కాలిక సంబంధముచే మరచిరి. అయినను "మీ రింతటి" వారని చెప్పిన మాత్రమున, ఆంజనేయునివలె వెంటనే వారి నిజశక్తులను జ్ఞాపకమునకు తెచ్చుకొన గలిగినవారు. ఇక ఆంధ్ర స్త్రీలోకమా—కేవలము ఆ పతిపూజలకు, ఆ లక్ష్మీపూజలకు, ఆ గోపూజలకు, ఆ గృహపూజలకు, ఆ మాతాపితృపూజలకు అలవాటు పడినది. ఆది నుంచీ, నిత్యకల్యాణములతోను, పచ్చతోరణములతోను, అతి సౌందర్యముగా యింటింట ఒక్కొక గదిని నాకు యేర్పాటుచేసి, నన్నా గదులలో పెట్టుకొని కలకలలాడుచు నాతో తిరుగుట కలవాటయిన ఆంధ్రస్త్రీలకు నేను 'గృహలక్ష్మి' గానే కనబడవలెను గాని నా భీకరాకారమైన స్వరూపముతోను, సింహ వాహనముతోను కనబడుట సమంజసమా? కాదు. ఇంతియు గాక, ఆభరణములన్నను, వివిధ రకములగు రంగు బట్టలన్నను, గాజులు మొదలగు వస్తువులన్నను, వీరికి ప్రీతి. ఈ మూలముగా వారు ఆంధ్రలక్ష్మిని, ఆంధ్రదేశ వస్త్రక వ్యాపారాభివృద్ధికొరకు తచ్ఛాదనీయక, ఆభరణ రూపకముగా అరికట్టుటగాని, వస్త్రప్రేమచే ఇతరదేశములకు పంపుట గాని చేయుచున్నారు. ఇది అస[illegible]ము.

చెల్లాయ్! నన్నొక్కమారు పరికించి చూడు. నా మెడలో మంగళసూత్రములు, పూలమాలిక తప్ప మరేమయిన ఆభరణము లున్నవా? సువాసినీలక్షణము చూపుకొరకు నాలుగు స్వదేశీ గాజులుతప్ప, కోట్లకొలది రూపాయిలను పాశ్చాత్యదేశముల కంపి, అక్కడనుంచి తెప్పించిన గాజులుగాని, పూసలుగాని, క్రెమంట్లు పిన్నులుగాని, గిల్టునూలుతో, ఆంధ్రదేశపు పనివారలచే వేయబడిన రంగులతో, ఆంధ్రులచే నేయబడిన చీరగాని. ఇది పాశ్చాత్యదేశములనుండి దిగుమతి కాబడిన 'సిల్కు' చీరకాదు. ఇవి అన్నీ స్వయంగా చూపించి, మీరు మీ మీదనే ఆధారపడాలని చెప్పుటకే మీలో అక్క చెల్లెలనయి, ఈ రూపములో తిరుగుచున్నాను. చెల్లాయ్! ఇప్పుడు నే నెవరినో తెలిసిందా? ఈ మారొచ్చినప్పుడు ఇంకా చెప్తానులే. అంది—

శ్యామల:—ఇంతట్లో నేను నిద్రమేల్కొని చూచేసరికి అక్కయ్య కనబడలేదు. ఈ మారొస్తే, గృహలక్ష్మి అక్కయ్యను మన యింటివద్ద వుండమనవ్, అమ్మా?

---

# తంజావూరు

శ్రీమతి కురుగంటి వెంకటలక్ష్మమ్మగారు

సీ॥ రమ్యమై వెలసెడి రాజసౌధంబులు కళకాంతులనుబాసి కనులబడును।
చుక్కలన్ జూచెడి సుందరంబగు గోపురంబులు ధూళిచే రంగుమాసె।
సిరిసంపదలతోడ చెన్నుమీరిన వర్తకావళి పెద్దమ్మ యతిథులైరి।
ఖ్యాతిజెందిన పూర్వకాల శిల్పంబులు మారు రూపములొంది మాయమయ్యె॥
తే॥ సిరులకాట పట్టంచును జెలగిమున్న
దేశదేశంబులందున వాసిగాంచి
యలమహారాష్ట్రి రాజ్యమై యలరినట్టి
తంజపురమిటు తనశోభ దరిగియుండె॥

సీ॥ మల్లెరోజాపుష్ప మాలతీతీవెల వెలయుతోటలు రూపుపేరుమాసె।
అంగనామణులతో సింగారముగనుండు అంతఃపురంబులు నంతమయ్యె।
వేదపారాయణవేత్తలౌ భూసురుల్ దీనతజెందిరి తేజమెడలి।
శౌర్యసంపన్నులు శస్త్రాస్త్రములుదాల్చి కాచుచుండెడికోట కాంతిదరిగె॥
తే॥ నిత్యభోగంబులందుచు నీటుగుల్కు
దేవతానిలయంబులు దీప్తిమాసె
అలమహారాష్ట్రిరాజ్యమై యలరినట్టి
తంజపురమిటు తనశోభ దరిగియుండె॥